నీటి సమస్యలు తలెత్తకుండా చూడాలి

• ఖానాపూర్ ఎమ్మెల్యే వెడ్మ బొజ్జుపటేల్



అధికారుల సమావేశంలో మాట్లాడుతున్న ఎమ్మెల్యే బొజ్జు పటేల్

జన్నారం: గ్రామాల్లో నీటి సమస్యలు తలెత్తకుండా అధికారులు చర్యలు చేపట్టాలని ఖానాపూర్ నియోజకవర్గ శాసనసభ్యులు వెడ్మ బొజ్జు పటేల్ అన్నారు. మండలంలోని ఎంపీడీవో కార్యాలయంలో శనివారం పంచాయతీ రాజ్ శాఖ అధికారులు, కార్యదర్శులతో సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే మాట్లాడుతూ.. వేసవి కాలంలో పలు గ్రామాల్లో నీటి సమస్యలు తలెత్తే అవకాశం ఉందని, అధికారులు అప్రమత్తమై ముందస్తుగా చర్యలు చేపట్టాలన్నారు. అధికారులు నిత్యం ప్రజలకు అందుబాటులో ఉంటూ సమస్యల పరిష్కారానికి కృషి చేయాలన్నారు. గ్రామాల్లో అభివృద్ధి పనుల విషయంలో జాప్యం వహించకుండా, నాణ్యతా ప్రమాణాలు పాటించాలన్నారు. గ్రామాల్లో నెలకొన్న సమస్యలు గుర్తించి తన దృష్టికి తీసుకురావాలన్నారు. అనంతరం మండల కేంద్రంలో శిక్షణ పొందిన మహిళలకు ఉచిత కుట్టుమిషన్లు అందజేశారు. చలివేంద్రాన్ని ప్రారంభించారు. అక్కడి నుంచి అలీనగర్, దొంగపల్లి గ్రామాల్లో పర్యటించారు. సమావేశంలో తహసీల్దార్ రాజమనోహర్ రెడ్డి, ఎంపీడీవో ఉమర్ షరీఫ్, పంచాయతీ రాజ్ డీఈ సుబ్బారెడ్డి, ఏఎంసీ చైర్మన్ దుర్గం లక్ష్మీనారాయణ, పీఏసీఎస్ చైర్మన్ రవి, పొనకల్ ఈవో రాహుల్, కాంగ్రెస్ పార్టీ మండల అధ్యక్షుడు ముజాఫర్ అలీఖాన్, కాంగ్రెస్ పార్టీ నాయకులు ఇసాక్, శుభాష్‌రెడ్డి, మాణిక్యం, రమేశ్, ఇందయ్య, శాఖీర్, పంచాయతీ కార్యదర్శులు పాల్గొన్నారు.

క్లుప్తంగా

30, 31తేదీల్లోనూ పన్ను చెల్లింపునకు అవకాశం

మంచిర్యాలటౌన్/బెల్లంపల్లి: మంచిర్యాల, బెల్లంపల్లి పట్టణ ప్రజలు ఈ నెల 30ఉగాది, 31వ తేదీ రంజాన్ పండుగ సెలవు రోజుల్లోనూ ఆస్తి పన్ను, నల్లా బిల్లులను చెల్లించేందుకు ప్రత్యేక కౌంటర్లు ఏర్పాటు చేసినట్లు మంచిర్యాల కమిషనర్ శివాజీ, బెల్లంపల్లి మున్సిపల్ కమిషనర్ కె.శ్రీనివాసరావు వేర్వేరు ప్రకటనల్లో తెలిపారు. మంచిర్యాల కార్పొరేషన్ కార్యాలయంలో, బెల్లంపల్లి మున్సిపల్ కార్యాలయంలో ప్రత్యేక కౌంటర్లు ఏర్పాటు చేసినట్లు, ప్రజలు సకాలంలో ఆస్తి పన్ను, నల్లా పన్ను, ట్రేడ్ లైసెన్స్‌లను చెల్లించి అభివృద్ధికి సహకరించాలని కోరారు.

అట్టహాసంగా యువ ఉత్సవ్..!



నృత్యం చేస్తున్న విద్యార్థినులు

మంచిర్యాలఅర్బన్: స్థానిక సీవీ రామన్ డిగ్రీ కళాశాలలో కేంద్ర యువజన సర్వీసులు, క్రీడల శాఖ ఆధ్వర్యంలో శనివారం నిర్వహించిన యువజన ఉత్సవ్ అట్టహాసంగా సాగింది. జిల్లాలోని డిగ్రీ కళాశాలల విద్యార్థులు ఆటపాటలతో అలరించారు. సైన్స్‌ఫేర్, ఫొటోగ్రఫీ, చిత్రలేఖనం, కవితా సంకలనం, ఉపన్యాస, సాంస్కృతిక పోటీలు నిర్వహించగా ఉత్సాహంగా పాల్గొన్నారు. ఉత్తమ ప్రతిభ కనబరిచిన విద్యార్థులకు నగదు బహుమతి అందించారు. కార్యక్రమంలో ఉమ్మడి జిల్లా యువజన సర్వీసుల శాఖ అధికారి సుశీల్‌కుమార్, ప్రోగ్రాం అధికారి సురేష్, సీవీ రామన్ డిగ్రీ కళాశాల కరస్పాండెంట్ గడిపెల్లి నర్సయ్య, శ్రీహర్ష డిగ్రీ కళాశాల కరస్పాండెంట్ భూమేశ్, కళాశాల యాజమాన్య సంఘం అధ్యక్షుడు రమణ, శ్రీధర్‌రావు తదితరులు పాల్గొన్నారు.

నకిలీ విత్తనాలపై అవగాహన

కాసిపేట/కోటపల్లి/భీమిని: నకిలీ పత్తి విత్తనాలు, గ్లైఫోసెట్ వాడొద్దని రైతులకు వ్యవసాయాధికారులు శనివారం అవగాహన కల్పించారు. కాసిపేట మండలంలోని వరిపేట, దేవాపూర్, ముత్యంపల్లి, కాసిపేట గ్రామాల్లో, కోటపల్లి మండలంలోని మల్లంపేట, భీమిని మండల కేంద్రాల్లో ఫర్టిలైజర్ దుకాణాలు తనిఖీ చేశారు. రికార్డులు పరిశీలించారు. రైతులకు తప్పనిసరిగా రశీదు ఇవ్వాలని సూచించారు. ఆయా కార్యక్రమాల్లో కాసిపేటలో ఏఈవోలు రమ్య, సంధ్యారాణి, వ్యవసాయాధికారి ప్రభాకర్, ఎస్సై ప్రవీణ్‌కుమార్, కోటపల్లిలో ఏవో సాయికృష్ణ, తహసీల్దార్ రాఘవేందర్‌రావు, ఎంపీడీవో లక్ష్మయ్య, భీమిని ఇన్‌చార్జి వ్యవసాయాధికారి వీరన్న, ఎస్సై విజయ్‌కుమార్, పీఏసీఎస్ మాజీ చైర్మన్ సంగర్స్ రవీందర్‌రావు, ఏఈవోలు వినోద్‌కుమార్, అఫ్రోజ్, రైతులు పాల్గొన్నారు.

ఎగ్జిక్యూటివ్ మెంబర్‌గా అంజలీదేవి



దండేపల్లి: తెలంగాణ హైకోర్టు బార్ అసోసియేషన్ ఎగ్జిక్యూటివ్ మెంబర్‌గా మండలంలోని వెల్గనూర్ గ్రామానికి చెందిన మహిళ న్యాయవాది ముత్తె అంజలీదేవి ఎన్నికయ్యారు. అంజలీదేవి భర్త తిరుపతి వర్మ టీపీసీసీ లీగల్ సెల్ వైస్ చైర్మన్‌గా కొనసాగుతున్నారు.

అలరించిన ఉగాది కవి సమ్మేళనం



మాట్లాడుతున్న వెంకటేశ్వర్‌గౌడ్

మంచిర్యాలఅర్బన్: స్థానిక సరస్వతీశిశుమందిర్ ఉన్నత పాఠశాలలో సంగీత సాహిత్య సుధావాహిని ఆధ్వర్యంలో శనివారం నిర్వహించిన ఉగాది కవి స మ్మేళనం అలరించింది. ముఖ్యఅతిథిగా బీజేపీ జి ల్లా అధ్యక్షుడు వెంకటేశ్వరగౌడ్ హాజరై మాట్లాడా రు. ఉగాది పండుగ అందరి జీవితాల్లో సుఖ సంతో షాలు, ఆయురారోగ్యాలు ఇవ్వాలని ఆకాంక్షించా రు. కార్యక్రమంలో శ్రీనాథ్‌గౌడ్, వామన్‌రావు, శ్రీనివాస్, రాజిరెడ్డి, తోకల రాజేశం, గోపగాని రవీందర్, శ్రీలక్ష్మి, సుబ్బాయమ్మ, సృజన, ప్రమీల, చంద్రశేఖర్, బ్రహ్మయ్యచార్య తదితరులు పాల్గొన్నారు.

'పది' పరీక్షలకు 99.76శాతం విద్యార్థుల హాజరు

మంచిర్యాలఅర్బన్: పదోతరగతి పబ్లిక్ పరీక్షలకు శనివారం నిర్వహించిన జీవశాస్త్రం పరీక్షకు 99.76శాతం విద్యార్థులు హాజరయ్యారు. మొత్తం రెగ్యులర్ విద్యార్థులు 9198మంది విద్యార్థులకు గాను 9176విద్యార్థులు హాజరుకాగా 22మంది గైర్హాజరయ్యారు. గతంలో ఫెయిలయిన విద్యార్థులు 134మంది విద్యార్థులకు గాను 117విద్యార్థులు హాజరుకాగా 17మంది గైర్హాజరయ్యారు. జిల్లా కేంద్రంలోని మోడల్‌స్కూల్ గర్మిళ్ల హైస్కూల్, శ్రీ చైతన్య పాఠశాలలో పరీక్షా కేంద్రాలను రాష్ట్ర పరిశీలకుడు సత్యనారాయణరెడ్డి, ఫ్లయింగ్ స్క్వాడ్ బృందాలు 12 పరీక్షా కేంద్రాలను పరిశీలించారని డీఈవో యాదయ్య తెలిపారు.

ప్రభుత్వ ఉద్యోగికి విరమణ తప్పనిసరి

• జిల్లా అదనపు కలెక్టర్ మోతీలాల్



మాట్లాడుతున్న జిల్లా అదనపు కలెక్టర్ మోతీలాల్

మంచిర్యాలఅగ్రికల్చర్: ప్రజలతో మమేకమై సేవలందించే ప్రతీ ప్రభుత్వ ఉద్యోగి జీవితంలో ఉద్యోగ విరమణ తప్పనిసరి అని జిల్లా అదనపు కలెక్టర్ మోతీలాల్ అన్నారు. సమీకృత కలెక్టరేట్ సమావేశ మందిరంలో శనివారం ఏర్పాటు చేసిన ఆత్మీయ వీడ్కోలు సమావేశంలో ముఖ్య ప్రణాళిక అధికారి కార్యాలయంలో ఉప గణాంక అధికారిగా పనిచేస్తూ ఈ నెల 31న ఉద్యోగ విరమణ పొందుతున్న నేపథ్యంలో అడ్లూరి రామకృష్ణచారి దంపతులను ముఖ్య ప్రణాళిక అధికారి జి.సత్యంతో కలిసి శాలువా, జ్ఞాపికలతో సన్మానించారు. కార్యక్రమంలో పూర్వ ముఖ్య ప్రణాళిక అధికారులు కృష్ణయ్య, రవీందర్, ప్రణాళిక శాఖ సిబ్బంది, వివిధ శాఖ అధికారులు, ఉద్యోగులు పాల్గొన్నారు.

చిన్నారి గొంతులో సేఫ్టీ పిన్ను

• కాకతీయ ఆసుపత్రిలో అరుదైన చికిత్స



అరుదైన శస్త్ర చికిత్స చేస్తున్న డాక్టర్ శ్రావణ్ కుమార్

మంచిర్యాలటౌన్: మంచిర్యాల పట్టణంలోని కాకతీయ గ్యాస్ట్రోలివర్ ఆసుపత్రిలో మూడు సంవత్సరాల బాబుకు అరుదైన శస్త్ర చికిత్స చేసినట్లు డాక్టర్ శ్రావణ్ కుమార్ తుమ్మాటి తెలిపారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. దహెగాం మండలం ఒడ్డుగూడ గ్రామానికి చెందిన రిషి అనే మూడు సంవత్సరాల బా బు ఆడుకుంటూ, అకస్మాత్తుగా సేఫ్టీ పిన్ను నోట్లో పెట్టుకొని మింగాడు. గొంతులో ఇరుక్కుపోవడంతో పట్టణంలోని కాకతీయ గ్యాస్ట్రో ఆసుపత్రికి తీసుకురాగా, డాక్టర్ శ్రావణ్‌కుమార్ ఎండోస్కోపీ ద్వారా గొంతులో ఉన్న పిన్నీసును బయటకు తీసి బాబును ప్రాణపాయ స్థితి నుంచి కాపాడారు. ఈ సందర్భంగా డాక్టర్ కు చిన్నారి తల్లిదండ్రులు, బంధువులు డాక్టర్ శ్రావణ్‌కుమార్‌కు కృతజ్ఞతలు తెలిపారు.

పాఠశాలల్లో ముందస్తు ఉగాది వేడుకలు



భీమారం: అంగన్‌వాడీ కేంద్రంలో ఉగాది సంబరాలు

దండేపల్లి/భీమిని/భీమారం: దండేపల్లి మండలంలోని పెద్దపేట, గుడిరేవు ప్రాథమిక పాఠశాలతో పాటు, గుడిరేవు ఉన్నత పాఠశాలల్లో, భీమిని మండలంలోని అక్కలపల్లి ప్రాథమిక పాఠశాలలో, భీమారం మండలంలోని ప్రభుత్వ పాఠశాలలు, అంగన్‌వాడీ కేంద్రాల్లో శనివారం ముందస్తుగా ఉగాది వేడుకలు నిర్వహించారు. ఉగాది విశిష్టతను గురించి విద్యార్థులకు పాఠశాలల ఉపాధ్యాయులు వివరించారు. అనంతరం విద్యార్థులకు పచ్చడి, బూరెలు పంచిపెట్టారు.

మహమ్మాయి అమ్మవారి ఉత్సవాలు ప్రారంభం

చెన్నూర్‌రూరల్: మండలంలోని ఆస్నాద, నాగాపూర్, కిష్టంపేట తదితర గ్రామాల్లో శనివారం మహమ్మాయి అమ్మవారి ఉత్సవాలు ప్రారంభమయ్యాయి. ప్రత్యేక మంటపాన్ని ఏర్పాటు చేసి అమ్మవారిని అలంకరించి ప్రతిష్ఠించారు. పనిముట్లను మంటపం వద్ద ఉంచి ప్రత్యేక పూజలు నిర్వహించారు.

కాంగ్రెస్ ఆధ్వర్యంలో జైసంవిధాన్



మంచిర్యాలటౌన్: పాల్గొన్న కాంగ్రెస్ నాయకులు

మంచిర్యాలటౌన్/మంచిర్యాలరూరల్(హాజీపూర్)/దండేపల్లి: ప్రజాస్వామ్య పరిరక్షణకు కాంగ్రెస్ పార్టీ అధినేత రాహుల్‌గాంధీ జై బాపు, జై భీమ్, జై సంవిధాన్ నినాదానికి పిలుపునివ్వగా జిల్లా కేంద్రంలోని మంచిర్యాల ఎమ్మెల్యే కొక్కిరాల ప్రేమ్‌సాగర్ రావు నివాసంలో, హాజీపూర్, దండేపల్లి మండలాల్లో శనివారం సన్నాహక సమావేశాలు నిర్వహించారు. ఏప్రిల్ 2వ తేదీ నుంచి మంచిర్యాల పట్టణంలోని ప్రతి వార్డులో పాదయాత్ర నిర్వహించి, జైబాపు, జైభీమ్, జైసంవిధాన్ కార్యక్రమాన్ని ప్రజల్లోకి తీసుకెళ్లాలని సూచించారు. కార్యక్రమాల్లో కాంగ్రెస్ పార్టీ ముఖ్య నాయకులు, మాజీ కౌన్సిలర్లు, ప్రజాప్రతినిధులు, మహిళా కాంగ్రెస్ నాయకులు పాల్గొన్నారు.

బొగ్గుబాయి వార్తలు

అధికారుల వేధింపులు మానుకోవాలి

• హెచ్‌ఎంఎస్ అధ్యక్షుడు రియాజ్ అహ్మద్



జీఎంకు వినతిపత్రం ఇస్తున్న రియాజ్ అహ్మద్

శ్రీరాంపూర్: శ్రీరాంపూర్ ఏరియాలో కొంతమంది అధికారులు కార్మికులను వేధింపులకు గురి చేస్తున్నారని హెచ్‌ఎంఎస్ అధ్యక్షుడు రియాజ్ అహ్మద్ తెలిపారు. శనివారం ఆయన శ్రీరాంపూర్ జీఎం శ్రీనివాస్‌ను కలిసి వినతిపత్రం అందజేశారు. కార్యక్రమంలో ఆ యూనియన్ కేంద్ర కమిటీ నాయకులు తిప్పారపు సారయ్య, బ్రాంచ్ ఉపాధ్యక్షుడు అనిల్ రెడ్డి, కార్యదర్శి పొనగంటి అశోక్ కుమార్, తదితరులు పాల్గొన్నారు.

క్లర్క్ పోస్టులు భర్తీ చేయాలి

శ్రీరాంపూర్: సింగరేణిలో క్లర్క్ పోస్టులు(జూనియర్ అసిస్టెంట్) వెంటనే భర్తీ చేయాలని టీబీజీకేఎస్ కేంద్ర ప్రధాన కార్యదర్శి కేతిరెడ్డి సురేందర్ రెడ్డి, బ్రాంచ్ ఉపాధ్యక్షుడు పెట్టం లక్ష్మణ్, డిప్యూటీ ప్రధాన కార్యదర్శి బండి రమేష్, కేంద్ర కమిటీ నాయకులు పొగాకు రమేష్, అన్వేష్ రెడ్డి, లాల, ముత్యాల రమేష్ శనివారం ఒక ప్రకటనలో యాజమాన్యాన్ని డిమాండ్ చేశారు.

హాజరుశాతం పెంచుకోవాలి



కౌన్సెలింగ్ నిర్వహిస్తున్న డీజీఎం అరవిందరావు

శ్రీరాంపూర్: గైర్హాజరు జాబితాలో చేరిన కార్మికులు ఇప్పటికైనా తమ హాజరుశాతాన్ని పెంచుకోవాలని శ్రీరాంపూర్ ఏరియా డీజీఎం(పర్సనల్) అరవింద రావు పేర్కొన్నారు. నాలుగు రోజులుగా జీఎం కార్యాలయంలోని కాన్ఫరెన్స్ హాల్లో జరుగుతున్న కౌన్సెలింగ్ ప్రక్రియ శనివారంతో ముగిసింది. 2024లో 100మస్టర్లు కూడా పూర్తి చేయని 278మంది ఉద్యోగులకు కౌన్సెలింగ్ నిర్వహించినట్లు తెలిపారు. చివరి రోజు ఆర్కే 5, ఆర్కే 6, సీహెచ్‌పీ గనుల్లో గైర్హాజరైన వారికి కౌన్సెలింగ్ నిర్వహించారు. కార్యక్రమంలో గుర్తింపు సంఘం ఏఐటీయూసీ బ్రాంచ్ కార్యదర్శి షేక్ బాజీసైదా, డీసీఎంవో రమేశ్ బాబు, పర్సనల్ మేనేజర్ రాజేశ్వర్, డీవైపీఎం రాజేష్, సీనియర్ పీఓలు రణదీప్ గౌడ్, సురేందర్ పాల్గొన్నారు.

మెడికల్ కార్డుల దరఖాస్తు గడువు పెంపు

శ్రీరాంపూర్: సింగరేణిలో మెడికల్ కార్డులు(సీపీఆర్ఎంఎస్) పొందడానికి దరఖాస్తు చేసుకునే గడువు పెంచినట్లు శ్రీరాంపూర్ డీజీఎం(పర్సనల్) అరవిందరావు శనివారం ఒక ప్రకటనలో తెలిపారు. సింగరేణిలో రిటైర్డ్, అన్‌ఫిట్, మృతి చెందిన ఉద్యోగులకు వారి కుటుంబ సభ్యులు వైద్య చికిత్స పొందడానికి ఈ మెడికల్ కార్డు ఎంతగానో ఉపయోగపడుతుందన్నారు. దీనికి గాను ప్రతి ఒక్కరూ రూ.60వేలు ఉద్యోగి కాంట్రిబ్యూషన్ క్రింద చెల్లించాల్సి ఉంటుందన్నారు. అనంతరం కార్డులు పొందుతారని, దీని ద్వారా కార్పొరేట్ ఆసుపత్రుల్లో చికిత్స పొందవచ్చన్నారు. ఇప్పటివరకు మెడికల్ కార్డులు తీసుకోని వారికి ఈ నెల 31వరకు గడువు నిర్ణయించగా, ఏప్రిల్ 15వరకు పొడిగించినట్లు తెలిపారు. అవకాశాన్ని సద్వినియోగం చేసుకోవాలన్నారు.

మందమర్రి ఏరియాలో 77శాతం బొగ్గు ఉత్పత్తి

మందమర్రిరూరల్: మందమర్రి ఏరియాలో 2024–25 ఆర్థిక సంవత్సరానికి 77శాతం బొగ్గు ఉత్పత్తి సాధించినట్లు అధికారులు తెలిపారు. ఈ ఆర్థిక సంవత్సరం మందమర్రి ఏరియాకు సంస్థ 34లక్షల 60వేల టన్నుల బొగ్గు ఉత్పత్తి లక్ష్యాన్ని నిర్దేశించగా, శనివారం నాటికి 26లక్షల 71వేల టన్నుల బొగ్గు ఉత్పత్తి సాధించినట్లు తెలిపారు.

జాతీయ సదస్సుకు శ్రీరాంపూర్ నాయకులు

శ్రీరాంపూర్: ఈ నెల 28, 29, 30తేదీల్లో జార్ఖండ్ రాష్ట్రంలోని రాంచీలో జరుగుతున్న 11వ ఆల్ ఇండియా కోల్ వర్కర్స్ ఫెడరేషన్ జాతీయ సదస్సుకు శ్రీరాంపూర్ సీఐటీయూ నాయకులు రాష్ట్ర ప్రతినిధులుగా హాజరయ్యారు. ఏరియా అధ్యక్షుడు గుల్ల బాలాజీ, నాయకులు అంబాల శ్రీనివాస్, వెంగళ శ్రీనివాస్, కస్తూరి చంద్రశేఖర్ సదస్సులో పాల్గొన్నారు.

కృత్రిమమేధను సద్వినియోగం చేసుకోవాలి

మంచిర్యాలఅర్బన్: ప్రభుత్వ పాఠశాలలో విద్యార్థులు కృత్రిమ మేధను సద్వినియోగం చేసుకోవాలని శనివారం పాఠశాల విద్య ప్రాంతీయ సంయుక్త సంచాలకుడు సత్యనారాయణరెడ్డి అన్నారు. స్థానిక ప్రభుత్వ ఉన్నత పాఠశాల సినిమావాడ క్యాంపస్‌లో ఉన్న ప్రభుత్వ ప్రాథమిక పాఠశాల గోపాల్‌వాడలో కృత్రిమ మేధ ల్యాబ్‌ను ఆర్‌జేడీ సత్యనారాయణరెడ్డి ప్రారంభించారు. కార్యక్రమంలో డీఈవో యాదయ్య, ఎంఈవో మాలవీదేవి, సమగ్రశిక్ష కో–ఆర్డినేటర్ సత్యనారాయణమూర్తి, సినిమావాడ ఉన్నత పాఠశాల ప్రధానోపాధ్యాయురాలు ప్రభావతి, ప్రాథమిక పాఠశాల ప్రధానోపాధ్యాయురాలు శృతి తదితరులు పాల్గొన్నారు.

లక్ష్యానికి మించి బ్యాంకు లింకేజీ రుణాలు

నెన్నెల: మండల సమాఖ్య ద్వారా 2024–25ఆర్థిక సంవత్సరానికి గాను లక్ష్యానికి మించి బ్యాంకు లింకేజీ రుణాలు అందజేశామని ఏపీఎం విజయలక్ష్మి అన్నారు. రూ.24.32కోట్ల లక్ష్యం కాగా, అంతకంటే ఎక్కువగా రూ.27.69కోట్లు బ్యాంకు లింకేజీ ద్వారా అందజేశామన్నారు. నెన్నెల సెర్ప్ కార్యాలయంలో శనివారం నిర్వహించిన మండల సమాఖ్య ప్రత్యేక సమావేశంలో ఆమె మాట్లాడారు. రుణాలు తీసుకొని సక్రమంగా తిరిగి చెల్లించిన 471సంఘాలకు మంజూరైన రూ.62.98లక్షలు వడ్డీమాఫీ డబ్బులను ఈ నెల 28న ఖాతాల్లో జమ చేశామన్నారు. అనంతరం కేక్ కట్ చేసి సంబురాలు చేసుకున్నారు.

సికిల్ సెల్ వ్యాధిపై శిక్షణ

తాండూర్: ప్రాథమిక ఆరోగ్య కేంద్రంలో శనివారం సికిల్‌సెల్ అనీమియా వ్యాధిపై శిక్షణ కార్యక్రమం నిర్వహించారు. పీహెచ్‌సీ మెడికల్ అధికారి ఝాన్సీ హాజరై వ్యాధి లక్షణాలు, స్క్రీనింగ్, అవగాహన, నివారణ చర్యలు తదితర అంశాలను వివరించారు.

పరిహారం చెక్కు అందజేత

వేమనపల్లి: గతేడాది డిసెంబర్ 8న ఒడ్డుగూడం అటవీ సెక్షన్ సుంపుటం అటవీ ప్రాంతంలో పులిదాడి చేసి ఆవుదూడను చంపి వేసింది. దీంతో పశువు యజమాని సుంపుటం గ్రామానికి చెందిన కొండగొర్ల రాజన్నకు పరిహారం మంజూరు అయింది. కాగా రూ. 10వేల చెక్కును శనివారం కుశ్నపల్లి ఎఫ్ఆర్‌వో దయాకర్, బెల్లంపల్లి ఎఫ్ఆర్‌వో పూర్ణచందర్ బాధితుడికి అందజేశారు.

బెల్లంపల్లి, చెన్నూర్‌లో ఇఫ్తార్

చెన్నూర్: చెన్నూర్ పట్టణంలోని జమా మసీదులో రంజాన్ పురస్కరించుకొని శనివారం ఏర్పాటు చేసిన ఇఫ్తార్ విందులో చెన్నూర్, కోటపల్లి సీఐలు దేవేందర్‌రావు, సుధాకర్ హాజరయ్యారు. కార్యక్రమంలో ఖాజా ఖంరోద్దీన్, ముస్లింలు పాల్గొన్నారు.

బెల్లంపల్లి: బెల్లంపల్లి సింగరేణి కళావేదికలో శనివారం రంజాన్ మాసాన్ని పురస్కరించుకొని రాష్ట్ర ప్రభుత్వం తరఫున ముస్లింలకు ఇఫ్తార్ విందు ఏర్పాటు చేశారు. ఆర్డీవో హరికృష్ణ, కాంగ్రెస్ నాయకులు న్యాతరి స్వామి, శంకర్, మల్లయ్య, ముస్లింలు పాల్గొన్నారు.

మున్సిపాలిటీకి ఎన్నికలు నిర్వహించాలి

మందమర్రిరూరల్: మందమర్రి మున్సిపాలిటీకి 28సంవత్సరాలుగా ఎన్నికలు లేక అభివృద్ధి కుంటుపడిందని, వెంటనే ఎన్నికలు నిర్వహించాలని డిమాండ్ చేస్తూ మున్సిపల్ ఎన్నికల సాధన సమితి ఆధ్వర్యంలో శనివారం ఒక్కరోజు మున్సిపల్ ఆఫీస్ ముందు దీక్ష చేపట్టారు. పలు రాజకీయ పార్టీల నాయకులు దీక్షకు సంఘీభావం ప్రకటించారు. మున్సిపాలిటీ అభివృద్ధి జరగాలంటే వెంటనే ఎన్నికలు నిర్వహించాలని డిమాండ్ చేశారు.

పోస్ట్‌మ్యాన్‌పై ఉన్నతాధికారుల ఆగ్రహం

తాండూర్: పింఛన్ల పంపిణీ వ్యవహారంలో తాండూర్ మండలం మాదారం పోస్ట్‌మ్యాన్‌పై ఉన్నతాధికారులు ఆగ్రహం వ్యక్తం చేశారు. పోస్ట్‌మ్యాన్ ఫారూక్ వ్యవహార తీరుపై ప్రతి నెలా లబ్ధిదారుల నుంచి ఫిర్యాదులు అందుతుండటంతో శనివారం ఉమ్మడి ఆదిలాబాద్ జిల్లా సూపరింటెండెంట్ ఆఫ్ పోస్ట్ ఆఫీసెస్ సిద్ధార్థ్ స్వయంగా రంగంలోకి దిగారు. మాదారం పోస్టాఫీస్‌ను ఆకస్మికంగా తనిఖీ చేశారు. సమాచారం తెలుసుకొని ఎంపీడీవో శ్రీనివాస్ అక్కడికి చేరుకున్నారు. లబ్ధిదారులతో మాట్లాడి పోస్ట్‌మ్యాన్ ఫారూక్‌పై చేసిన ఆరోపణలను సిద్ధార్థ్‌కు వివరించారు. అప్పటికే ఉన్నతాధికారులు ఆయనను హెచ్చరించినా, పద్ధతి మార్చుకోకపోవడంతో ఆయనపై శాఖపరమైన చర్యలకు సిద్ధార్థ్ ఆదేశించారు.

దానాల్లో రక్తదానం ఎంతో గొప్పది

బెల్లంపల్లి: దానాలన్నింటిలో రక్తదానం ఎంతో గొప్పదని బెల్లంపల్లి జూనియర్ సివిల్ కోర్టు జడ్జి ముఖేష్ అన్నారు. జనహిత సేవాసమితి 8వ వార్షికోత్సవాన్ని పురస్కరించుకొని శనివారం తాఫీ సంఘ భవనంలో మెగా రక్తదాన శిబిరం నిర్వహించగా, ఆయన ముఖ్య అతిథిగా హాజరై రక్తదానం చేశారు. ఆర్డీవో హరికృష్ణ మాట్లాడుతూ.. రక్తదానం ప్రాణదానంతో సమానమన్నారు. ఆరోగ్యవంతులైన ప్రతి ఒక్కరూ రక్తదానం చేయాలని సూచించారు. 122యూనిట్ల రక్తం సేకరించారు. కార్యక్రమంలో మున్సిపల్ కమిషనర్ కె.శ్రీనివాసరావు, జనహిత సేవా సమితి అధ్యక్షుడు ఆడేపు సతీష్, మాజీ కౌన్సిలర్ గెల్లి రాజలింగు, రెడ్‌క్రాస్ సొసైటీ శ్రేణులు కాసర్ల శ్రీనివాస్, రంజిత్, జనహిత సభ్యులు, తదితరులు పాల్గొన్నారు.

భవన నిర్మాణ కార్మిక సంఘం కమిటీ ఎన్నిక

బెల్లంపల్లి: పట్టణంలోని ఎస్సీ కమ్యూనిటీ హాల్లో శనివారం తెలంగాణ భవన నిర్మాణ కార్మిక సంఘం అసెంబ్లీ నియోజకవర్గ, పట్టణ కమిటీ ఎన్నికలు నిర్వహించారు.

ప్రభుత్వ భూమిని పేదలకు పంచాలని వినతి

జన్నారం: మండల పరిధిలోని చింతగూడ పాపమ్మగూడ సర్వే నంబర్ 81/1 లోని ప్రభుత్వ భూమిని పేదలకు పంపిణీ చేయాలని శనివారం తహసీల్దార్ రాజమనోహర్‌రెడ్డికి సీపీఐ ఎంఎల్ ఆధ్వర్యంలో వినతిపత్రం అందజేశారు.

సహకార శాఖ డైరీ ఆవిష్కరణ

మంచిర్యాలఅగ్రికల్చర్: జిల్లా సహకార శాఖ సంఘం డైరీని శనివారం జిల్లా సహకార శాఖ కార్యాలయంలో డీసీవో మోహన్, టీఎన్జీవో సంఘం నాయకులతో కలిసి ఆవిష్కరించారు.

మద్యం తాగి వాహనం నడపొద్దు

మందమర్రిరూరల్: మద్యం తాగి వాహనాలు నడపొద్దని, నడిపితే కేసులు తప్పవని మందమర్రి సీఐ శశిధర్‌రెడ్డి అన్నారు. సర్కిల్ పీఎస్ ఆవరణలో శనివారం మద్యం సేవించి పట్టుబడిన 42మందికి ఆయన కౌన్సెలింగ్ నిర్వహించారు. కార్యక్రమంలో మందమర్రి ఎస్సై రాజశేఖర్, కాసిపేట ఎస్సై ప్రవీణ్, మందమర్రి అదనపు ఎస్సై శ్రీనివాస్, పోలీస్ సిబ్బంది ఉన్నారు.

పోస్టర్ ఆవిష్కరణ

పాతమంచిర్యాల: దేశవ్యాప్తంగా కులగణన చేపట్టాలని తెలంగాణ రాష్ట్రంలో బీసీ రిజర్వేషన్‌లు 42శాతానికి పెంచుతూ అసెంబ్లీలో చేసిన చట్టాన్ని కేంద్ర ప్రభుత్వం అమలు చేయాలని రాష్ట్ర బీసీ సంక్షేమ సంఘం జిల్లా అధ్యక్షుడు డాక్టర్ నీలకంఠేశ్వర్ రావు అన్నారు. జిల్లా కేంద్రంలోని చార్వాక ట్రస్టు భవన్‌లో శనివారం బీసీల పోరుగర్జన పోస్టర్ ఆవిష్కరించారు. ఏప్రిల్ 2న ఢిల్లీలో నిర్వహించే పోరుగర్జనకు బీసీలు అధిక సంఖ్యలో హాజరై బీసీల గళాన్ని వినిపించాలన్నారు.

సంక్షిప్త వార్తలు

ఉచిత కంటి వైద్యశిబిరం

దండేపల్లి: మండలంలోని మేదరిపేటలో రఘునాథ్ వెరబెల్లి ఫౌండేషన్ ఆధ్వర్యంలో శనివారం ఉచిత కంటి వైద్యశిబిరం నిర్వహించగా ఫౌండేషన్ వ్యవస్థాపకులు, జిల్లా బీజేపీ మాజీ అధ్యక్షుడు రఘునాథ్ ప్రారంభించారు.

'ఎమ్మెల్యే బొజ్జుకు మంత్రి పదవి ఇవ్వాలి'

జన్నారం: ప్రజల్లో ఉంటూ, గ్రామాల అభివృద్ధి, ప్రజల సంక్షేమం కోసం పని చేస్తున్న ఖానాపూర్ ఎమ్మెల్యే బొజ్జు పటేల్‌కు మంత్రి పదవి ఇవ్వాలని తెలంగాణ గౌడ సంఘం జిల్లా ఉపాధ్యక్షుడు తిరుపతిగౌడ్, మండల నాయకులు భాస్కర్‌గౌడ్, చంద్రయ్య శనివారం ఒక ప్రకటనలో కోరారు.

వేతన బకాయిలు చెల్లించాలని వినతి

పాతమంచిర్యాల: నగరపాలక సంస్థ నస్పూర్ పరిధిలో పనిచేసే మున్సిపల్ కాంట్రాక్టు కార్మికులకు 3నెలలగా వేతనాలు చెల్లించడం లేదని తెలంగాణ మున్సిపల్ స్టాఫ్ అండ్ అవుట్‌సోర్సింగ్ యూనియన్ గౌరవ అధ్యక్షుడు మేకల దాసు అన్నారు. కార్మికులకు నెలనెలా వేతనాలు అందేలా చూడాలని నగరపాలక సంస్థ కమిషనర్ శివాజీకి వినతిపత్రం ఇచ్చారు.

యాంటీడ్రగ్స్ పోస్టర్ ఆవిష్కరణ

చెన్నూర్‌రూరల్: మండలంలోని కిష్టంపేట గ్రామంలోని ప్రభుత్వ డిగ్రీ కళాశాలలో శనివారం యాంటి డ్రగ్స్ పోస్టర్ ఆవిష్కరించారు.కార్యక్రమంలో కళాశాల ప్రిన్సిపాల్ ఎంవి.పట్వర్ధన్, వైస్ ప్రిన్సిపాల్ కిశోర్‌కుమార్, యాంటి డ్రగ్ కో ఆర్డినేటర్ ఎండి సర్వర్ పాషా, అధ్యాపకులు పాల్గొన్నారు.

పౌరులు తమ హక్కులను పొందాలి

కోటపల్లి: మండలంలోని నాగంపేట గ్రామంలో శనివారం తహసీల్దార్ రాఘవేందర్‌రావు ఆధ్వర్యంలో పౌరహక్కుల దినోత్సవం నిర్వహించారు. సమాజంలో పౌరులందరూ తమ హక్కులను పొందాలని తహసీల్దార్ సూచించారు.

రోడ్డు బాగు చేయాలని నిరసన

కాసిపేట: సోమగూడెం నుంచి కాసిపేట మండల కేంద్రం, కాసిపేట1, 2గనులకు వెళ్లే రోడ్డు దుబ్బగూడెం గ్రామ శివారు నుంచి కాసిపేట వరకు రోడ్డు సక్రమంగా లేక తీవ్ర ఇబ్బందులు పడుతున్నామని, వెంటనే రోడ్డును బాగు చేయాలని శనివారం ఏఐటీయూసీ ఆధ్వర్యంలో కార్మికులు రోడ్డుపై నిరసన తెలిపారు.

ఉచిత ఈఏపీ సెట్ నమూనా పరీక్ష

నస్పూర్: ఇంటర్ పూర్తి చేసుకొని ఇంజనీరింగ్, అగ్రికల్చర్ సీటు కోసం ఈఏపీ సెట్‌కు అప్లై చేసుకున్న విద్యార్థులకు పట్టణంలో సృష్టి ఇనిస్టిట్యూట్ ఆధ్వర్యంలో ఈ నెల 31న ఉదయం 10గంటలకు ఉచిత నమూనా పరీక్ష నిర్వహించనున్నట్లు నిర్వాహకుడు రాజ్‌కుమార్ శనివారం ఒక ప్రకటనలో తెలిపారు. ఆసక్తి ఉన్న వారు ఆదివారం సాయంత్రం లోగా 87978 70303 నంబర్‌కి కాల్‌చేసి తమ పేర్లు నమోదు చేసుకోవాలని సూచించారు.

ఈద్గా ప్రహరీ ప్రారంభం

మంచిర్యాలటౌన్: జిల్లా కేంద్రంలోని ఆండాళమ్మ కాలనీలో గల ఈద్గాలో రూ.30 లక్షలతో నిర్మించిన ప్రహరీని శనివారం ఎమ్మెల్యే కొక్కిరాల ప్రేమ్‌సాగర్‌రావు ప్రారంభించారు.

కుష్ఠువ్యాధి సర్వే పకడ్బందీగా నిర్వహించాలి

మందమర్రిరూరల్: కుష్ఠు వ్యాధి సర్వేను వైద్య ఆరోగ్య శాఖ ఆధ్వర్యంలో పకడ్బందీగా నిర్వహించాలని ఎల్‌సీడీసీ రాష్ట్ర పరిశీలకులు డాక్టర్ సాగర్ అన్నారు. అందుగులపేటలో శనివారం ఇంటింటికీ తిరిగి సిబ్బందితో సర్వేలో పాల్గొన్నారు. ప్రాథమిక ఆరోగ్య కేంద్రాన్ని సందర్శించి రికార్డులు పరిశీలించారు. ప్రభుత్వ వైద్యాధికారి రమేశ్, వైద్య సిబ్బంది ఉన్నారు.

అన్నదానం

మంచిర్యాలటౌన్: మంచిర్యాలకు చెందిన సామాజిక్ చారిటబుల్ ట్రస్టు ఆధ్వర్యంలో జిల్లా కేంద్రంలోని రంగంపేట్, గోపాల్‌వాడలో శనివారం అన్నదానం నిర్వహించారు.

ల్యాప్‌టాప్స్ అందజేత

మంచిర్యాలఅర్బన్: పట్టణంలోని గర్మిళ్ల ప్రభుత్వ పాఠశాల, శిశు మందిర్ పాఠశాలలకు సేవా భారతి ఆధ్వర్యంలో ల్యాప్‌టాప్‌లు పంపిణీ చేశారు.

గుడుంబా పట్టివేత

వేమనపల్లి: మండలంలోని సూరారం గ్రామపంచాయతీ ప్రజలు గుడుంబా గ్రామంలో అమ్మకూడదని ఇటీవల తీర్మానం చేసుకున్నారు. బెల్లంపల్లి మండలం లంబాడితండాకు చెందిన దరావత్ రవి శనివారం 50గుడుంబా ప్యాకెట్లతో సూరారం రాగా, గ్రామ యువకులు అతడిని పట్టుకొని నీల్వాయి ఎస్సైకి సమాచారం ఇచ్చారు. బైక్‌తో పాటు విక్రయదారుడిని, 50గుడుంబా ప్యాకెట్లను పోలీసులు స్వాధీనం చేసుకున్నారు. యువకులను ఎస్సై శ్యాంపటేల్ అభినందించారు.

విద్యార్థినులను చితకబాదిన ఉపాధ్యాయురాలు

భీమిని: భీమిని కేజీబీవీ పాఠశాలలోని నలుగురు విద్యార్థినులను, అదే పాఠశాలలో పనిచేస్తున్న ఉపాధ్యాయురాలు చితకబాదిన సంఘటన శుక్రవారం రాత్రి చోటు చేసుకుంది. విద్యార్థినులు ఫోన్‌చేసి తల్లిదండ్రులకు తెలపడంతో విషయం బయటపడింది. ఉపాధ్యాయురాలు సుజాత కేజీబీవీ పాఠశాలలోని విద్యార్థులకు కాస్మొటిక్ వస్తువులు బయటి నుంచి తెచ్చి అమ్ముతుందని, ఆరు, ఎనిమిది తరగతులకు చెందిన నలుగురు విద్యార్థినులు కొనకపోవడంతోనే ఉపాధ్యాయురాలు కొట్టిందని పేర్కొన్నారు. విషయం తెలుసుకున్న ఎంఈవో కృష్ణమూర్తి కేజీబీవీ పాఠశాలకు వెళ్లి విద్యార్థులతో మాట్లాడి వివరాలు సేకరించి విచారణ చేపట్టారు. ఈ కార్యక్రమంలో ఇన్‌చార్జి ప్రత్యేకాధికారి శారద ఉన్నారు.